

పట్టువస్త్రాల బహూకరణ


అన్నవరం: రత్నగిరిలోని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, ఇతర దేవతామూర్తుల అలంకరణకు అయ్యన్నదొర 15 పట్టు పంచెలు, 15 పట్టు చీరలు సమర్పించారు.



సేవకు చిరునామా స్వర్ణాంధ్ర

సమాజంలో అవసరార్థులకు సేవలు అందించడంలో స్వర్ణాంధ్ర సేవాసంస్థ ముందంజలో ఉంది. శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుక జరుపుకోనుంది. - 8లో▸

డెల్టాలకు నీరు



రాజమహేంద్రవరం రూరల్: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పుడెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా మీదుగా శుక్రవారం నుంచి ఈనెల 11వ తేదీ మధ్య పలు రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. శుక్రవారం టాటా - ఎస్ఎంవీ బెంగళూరు(08885), శనివారం హటియా - ఎస్ఎంవీ బెంగళూరు(08887), 8న తాంబరం - న్యూటిన్ సుకియా (06073), 11న న్యూటిన్ సుకియా - తాంబరం (06074) మధ్య రైళ్లు రాకపోకలు సాగిస్తాయన్నారు. తుని, సామర్లకోట, రాజమహేంద్రవరం స్టేషన్లలో ఇవి ఆగుతాయి.

రేషన్ బియ్యం స్వాధీనం

నిడదవోలు రూరల్: సూరాపురంలో అక్రమంగా నిల్వ చేసిన 5.40 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కోలా నాగేశ్వరరావు అనే వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇంటి వద్ద నిల్వ చేశాడని వచ్చిన సమాచారం మేరకు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ పీవీ రవి కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రూ.1.95 లక్షల విలువ చేసే రేషన్ బియ్యాన్ని గుర్తించారు. దాడుల్లో సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన పేదల ఇళ్ల నిర్మాణం

జిల్లా కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాదవీలత

సీటీఆర్ఐ: నిర్ణీత సమయంలో లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మాధవీలత చెప్పారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్టేజ్ కన్వర్షన్ వేగవంతంగా చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 10 గ్రామాల పరిధిలో రీ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 1,49,874 లబ్ధిదారులకు గానూ 1,02,983 మందికి పట్టాలు అందించామన్నారు. 3177 మంది దరఖాస్తులు అర్హత లేవని గుర్తించామన్నారు. రబీ సీజన్‌లో 37207 హెక్టార్లకు సంబంధించి ఈకేవైసీ 100 శాతం పూర్తయ్యిందన్నారు. పీఎం కిసాన్ పథకం అర్హులైన రైతులకు వర్తించేందుకు 1,17,189 రైతులలో 84,873 మంది ఈకేవైసీ పూర్తి చేశారన్నారు. మెరుగైన ఆరోగ్యాన్ని ప్రజలకు అందించేందుకు ఆక్వా హబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వైఎస్సార్ చేయూత పథకం కింద జీవనోపాధి కోసం స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ ఏడాది రూ.24,511 కోట్ల రుణాలు అందజేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన 947 పనులలో 837 గ్రౌండింగ్ అయ్యాయన్నారు, సగటున ప్రతి సచివాలయం ద్వారా 89 సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె. దినేష్ కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు .

మండల కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు, సిబ్బంది

నల్లజర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిధులు దుర్వినియోగమైనట్లు వచ్చిన ఫిర్యాదుపై రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు, సీఐ రమేష్ విచారణ చేపట్టారు. గురువారం కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. 2020–21లో నాటి ఎంపీడీఓ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి దాదాపు రూ.20లక్షలకు పైగా నిధులు స్వాహా చేశారని గత ఏడాది ఫిబ్రవరిలో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై కేసు నమోదైంది. ఈ నిధులను అధికారులిద్దరూ తమ ఖాతాలకు మళ్లించినట్టు విచారణ అధికారులు గుర్తించారు. వివిధ సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఎన్నికల నిర్వహణపై తప్పుడు రికార్డులు చూపి, ఖర్చును సొంత ఖాతాలలో జమచేసుకున్నారు. నిర్వాహకులకు ఇచ్చినట్టు నకిలీ బిల్లులు సృష్టించారు. అప్పట్లో కొన్ని గ్రామాలకు వీరిద్దరూ ప్రత్యేక అధికారులుగా వ్యవహరించారు. అక్కడ కూడా నిధులు స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. వీటన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ముత్యాలనాయుడు తెలిపారు.

ఊరిలోనే రిజిస్ట్రేషన్

- జిల్లాలో భూ సమగ్ర సర్వే ప్రక్రియ
- పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు
- 33 సచివాలయాల ఎంపిక
- రెండు సచివాలయాల్లో ఇప్పటికే ట్రయల్ రన్
- గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన

సాక్షి, రాజమహేంద్రవరం: గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు మార్గం సుగమమైంది. రిజిస్ట్రేషన్లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా తొలుత 51 గ్రామ, వార్డు సచివాలయాలను ఎంపిక చేసింది. ఎలాంటి భూ వివాదాలు లేని, సమగ్ర భూ సర్వే పూర్తయిన 33 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఈ ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టుగా కొవ్వూరు నియోజకవర్గం తోగుమ్మి, రాజానగరం నియోజకవర్గం భూపాలపట్నం సచివాలయాల్లో సేవలను ఇప్పటికే ప్రారంభించింది. త్వరలో నిర్దేశించిన 31 సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేస్తోంది.

ఇప్పటి వరకు ఏం జరుగుతోందంటే..

స్థిర, చరాస్తులు, విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో అక్కడున్న డాక్యుమెంట్ రైటర్లు, దళారులు నిర్ణయించిన ధర చెల్లించాల్సి వచ్చేది. లేని పక్షంలో డాక్యుమెంట్లు సక్రమంగా లేవంటూ కొర్రీలు పెట్టి వెనక్కు పంపుతున్న సంఘటనలు కోకొల్లలు. కొందరు సబ్ రిజిస్ట్రార్లు దళారులతో కుమ్మక్కు కావడంతో అక్రమ తంతు యథేచ్ఛగా నడిచేది. అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందేలా చర్యలు తీసుకుంది. భూముల అమ్మకం, కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలన్నీ సచివాలయ కేంద్రంగానే చేపట్టేలా ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టింది. ప్రక్రియ సమర్థవంతంగా జరగాలంటే భూముల వివాదాలు ఉండకూడదని భావించింది. సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో అయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావించి తొలుత అలాంటి గ్రామాలను ఎంపిక చేసింది.



రిజిస్ట్రేషన్లకు ఎంపికైన బొమ్మూరు-2 సచివాలయం

సిబ్బందికి అవగాహన

- రిజిస్ట్రేషన్ ప్రక్రియపై గ్రామ సచివాలయ సిబ్బందికి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇప్పటికే అవగాహన కల్పించారు.
- ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి మరీ డాక్యుమెంట్ల పరిశీలన, చలానా తదితర విషయాలపై సమగ్రంగా సమాచారం అందించారు.
- ఇది వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందే సేవలన్నీ సచివాలయాలకు అనుసంధానం చేశారు.
- అక్నాలెడ్జ్‌మెంట్ అప్‌డేట్, డేటా ఫీడింగ్, చెక్‌స్లిప్, రెగ్యులర్ నంబర్ కేటాయింపు, ఫొటో, వేలిముద్రలు తీసుకోవడం, డాక్యుమెంట్ ప్రింటింగ్, స్కానింగ్, దస్తావేజు, సెటిల్‌మెంట్ దస్తావేజు, దాన విక్రయ, తనఖా, చెల్లు రశీదు, భాగ పరిష్కార రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వివాహ రిజిస్ట్రేషన్ తదితర సేవలు ఉన్న ఊళ్లోనే అందుతాయి.
- రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు సచివాలయంలో ఒక పంచాయతీ సెక్రటరీకి ప్రభుత్వం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ హోదా కల్పించింది.
- ఇకపై సచివాయలంలో జరిగే స్థిర, చరాస్తి క్రయ, విక్రయాల విక్రయం, కోనుగోలుపై పర్యవేక్షణ చేయాల్సి ఉంది.



తోగుమ్మిలో రిజిస్ట్రేషన్ పత్రాలు పొందుతున్న వ్యక్తి

రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రెండు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ రెండింటిలోనూ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గం తోగుమ్మిలో ఇప్పటి వరకు 101 రిజిస్ట్రేషన్లు జరిగ్గా వీటి విలువ రూ.26,58,522గా ఉంది. రాజానగరం నియోజకవర్గం భూపాలపట్నంలో రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. లేఅవుట్లు ఎక్కువగా ఉన్న కారణంతో భారీగా ఆదాయం సమకూరినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఇప్పటి వరకు రూ.16,96,53,581 విలువ చేసే 302 స్థిర, చరాస్తులు రిజిస్ట్రేషన్లు జరగ్గా.. రూ.73,23,939 ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది.



త్వరలో మరిన్ని గ్రామాల్లో..

జిల్లాలో త్వరలో మరిన్ని గ్రామాల్లో సేవలు ప్రారంభం కానున్నాయి. అందులో నేలటూరు, నందిగంపాడు, జగన్నాథపురం, జగన్నాథపురం(గంగవరం), చిడిపి, తిమ్మరాజుపాలెం, బల్లిపాడు, పేరరామచంద్రపురం, అనపర్తి-5, కొప్పవరం, మహేంద్రవాడ-1, పోలమూరు-1, రామవరం-1, కుతుకులూరు-1, పెదపర్తి, పూలగుర్త, ఇల్లపల్లి, ఇల్లపల్లి(తుమ్మలాపల్లి), ఇల్లపల్లి(రాళ్లకండ్రిగ), కోమరిపాలెం-2, తొస్సిపూడి, పందలపాక-1,కొంకుదురూరు-1, దామిరెడ్డిపల్లి, బొమ్మూరు-2, రాజవోలు-1, శ్రీకృష్ణపట్నం, జి.ఎర్రవరం, నామవరం, సుభద్రంపేట, నార్త్ తిరుపతి రాజాపురం సచివాలయాల్లో త్వరలో సేవలు అందుబాటులోకి వస్తాయి.

అవగాహన కల్పిస్తున్నాం



రిజిస్ట్రేషన్ పక్రియపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. స్థిరాస్తి క్రయ, విక్రయాలు, ఏ సేవకు ఎంత వసూలు చేయాలన్న విషయమై సమగ్రంగా చెబుతున్నాం. చలానాలు, ప్రభుత్వ ఫీజులు తీసుకోవాల్సిన వాటిపై చెబుతున్నాం. సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే ఎలా అధిగమించాలో స్పష్టం చేస్తున్నాం. తొలి విడతలో కేటాయించిన వాటిలో రిజిస్ట్రేషన్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుగుతున్నాయి. మిగిలిన వాటిలో సైతం పారదర్శకంగా జరిగేలా చూస్తాం.

- ఆనందరావు,
జిల్లా రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ

గడువు ముగిసిన ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలు ఆపాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అనుమతులు ముగిసిన ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలు జరగకుండా చూడాలని, అందుకు సంబంధించిన నివేదికను వెంటనే సిద్ధం చేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఆమె అధ్యక్షతన జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గడువు ముగిసిన ఇసుక ర్యాంపులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పనుల కోసం వినియోగించాల్సిన ఇసుక విషయంలో జాప్యం లేకుండా సరఫరా జరగాలన్నారు. డిసెంబర్ 9న జరిగిన సమావేశంలో వచ్చిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై సమీక్షించారు. తూర్పుగోదావరి జిల్లాకి చెందిన 11 ర్యాంపుల విషయమై సమావేశంలో చర్చించారు. అలాగే జిల్లాలో ఇసుక రీచ్‌ల లీజుదారులతో కలెక్టర్ మాధవీలత సమావేశం నిర్వహించారు. అనుమతులు ఇచ్చిన రీచ్‌ల ద్వారా పనులను మార్గదర్శకాల మేరకు ప్రారంభించాలన్నారు. పెండింగ్ అనుమతులకు సంబంధించి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో కాకినాడ డీడీ మైన్స్ ఈ.నరసింహారెడ్డి, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, అడిషనల్ ఎస్పీ రజనీ, రాజమహేంద్రవరం ఏడీఎం విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

రేపు వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): వికాస ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పలు ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఆయా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. శనివారం ఉదయం 9.30 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరుకావాలన్నారు.

వెంకన్నకు వెండి పంచ పీఠం సమర్పణ



అంబాజీపేటలో పంచపీఠంపై ఉన్న వేంకటేశ్వరస్వామి

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన గొలకోటి వెంకట్ మణికుమారి దంపతులు రూ.2.25 లక్షలు విలువైన వెండి పంచ పీఠంను గురువారం అందజేశారు. బండారువారివీధికి చెందిన బండారు సత్యనారాయణ (అబ్బు) రూ.30 వేలు విలువైన వెండి ఆభరణాలను స్వామివారికి సమర్పించారు. పంచ పీఠం, వెండి ఆభరణాలను తొలుత ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

అర్హులందరికీ ఆవాసం కల్పించడమే లక్ష్యం

- టిడ్కో గృహాలపై ఎంపీ భరత్‌రామ్ సమావేశం
- హాజరైన బ్యాంకర్లు, లబ్ధిదారులు

రాజమహేంద్రవరం రూరల్: అర్హులందరికీ సొంతింటి కల నెరవేరుతుందని ఎంపీ భరత్ రామ్ అన్నారు. ఈవిషయమై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గట్టి సంకల్పంతో ఉన్నారన్నారు. గురువారం తమ కార్యాలయంలో బ్యాంకర్లు, సంబంధిత శాఖ అధికారులు, టిడ్కో డిఫాల్ట్ లబ్ధిదారులతో ఆయన విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. లబ్ధిదారుల అభిప్రాయాలు, ఆర్థిక పరిస్థితి, బ్యాంకర్ల అభిప్రాయాలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ జిల్లాలో టిడ్కో గృహాలు 2,832 ఉన్నాయన్నారు., వాటిలో 1,833 ఇళ్లకు రుణాలు మంజూరయ్యాయని చెప్పారు. 1,734 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. 119 మంది సొంత సొమ్ము చెల్లించగా 880 మంది ఇళ్లకు సంబంధించి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రుణాలు చెల్లించే ఆర్థిక స్థోమతు లేకపోవడం, వయోభారం కారణంగా కొందరికి రుణాలు మంజూరు కాకపోవడం లాంటి కారణాలతో చాలా మంది డిఫాల్టర్స్‌గా ఉండిపోయారన్నారు. టిడ్కో గృహాలు కావాలా, లేకపోతే జగనన్న గృహాలు కావాలా అనేది నిర్ణయం తెలియజేస్తే తగు నిర్ణయం తీసుకుంటామని ఎంపీ భరత్ వారికి చెప్పారు. కేంద్రప్రభుత్వం నిబంధనల ప్రకారం టిడ్కో గృహ లబ్ధిదారులు నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు చొప్పున 20 సంవత్సరాల పాటు బ్యాంకులకు చెల్లించవలసి ఉంటుందన్నారు. ఆర్థిక పరిస్థితి, ఆదాయ వనరులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం చెప్పవచ్చని లబ్ధిదారులకు ఆయన సూచించారు. రుణాలు సక్రమంగా కట్టనివారిని డిఫాల్టర్స్ జాబితాలో ఉంచినట్టు బ్యాంకర్లు తెలిపారన్నారు. రుణాలు కట్టగలమని లబ్ధిదారులు బలంగా చెప్పగలిగితే బ్యాంకర్లను ఒప్పించి రుణమిప్పిస్తామని భరత్ హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్లు రాకుంటే నవరత్నాలు–పేదలకు ఇళ్ల పథకం కింద సెంటు స్థలమిచ్చి, రూ.1.8 లక్షలతో ఇల్లు కట్టుకునేలా చొరవ తీసుకుంటామన్నారు. ఈ అంశంపై మరోసారి చర్చించి నిర్ణయానికి వద్దామని చెప్పారు. కోపరేటివ్ బ్యాంకులకు టిడ్కో గృహాలకు రుణాలిచ్చే సదుపాయం లేదని తెలియడంతో వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు ఎంపీ ఫోన్ చేశారు. భరత్ విజ్ఞప్తిపై రుణ మంజూరుకు కోపరేటివ్ బ్యాంకు అధికారులు అంగీకారాన్ని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఏడీఈ పీఎం సత్యవేణి, టిడ్కో ఎస్ఈ శ్రీనివాస్, మెప్మా అధికారి డి.రవిశంకర్, టిడ్కో ఏఈ సూర్యకుమారి, లీడ్ బ్యాంకు ఎల్డీఎం దిలీప్ కుమార్, హెచ్వోడీ మాధవి, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్స్, వివిధ బ్యాంకుల అధికారులు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్‌సీపీ నేత పాలిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్ రామ్

మహిళా ఓటర్లదే పైచేయి





- జిల్లాలో ఓటర్లు 15,52,268 మంది
- పురుషుల కంటే మహిళలే ఎక్కువ
- వడపోతల అనంతరం తుది జాబితా వెల్లడి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఓటు వజ్రాయుధం. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేసి నచ్చిన వ్యక్తిని నాయకుడిని చేయవచ్చు. నచ్చని వ్యక్తిని దింపవచ్చు. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ఓటు నమోదు ప్రక్రియ పూర్తయింది. జిల్లా పరిధిలో ఓటర్ల సంఖ్య తాజాగా లెక్క తెలింది. 18 సంవత్సరాలు నిండిన వారిని, ఈ ఏడాది జనవరి నాటికి 18 సంవత్సరాలు వస్తున్న వారిని కూడా ఓటర్ల జాబితాలో చేర్చారు. ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రతి కళాశాలలోనూ ఈ ప్రక్రియ చేపట్టారు. ఓటు నమోదుకు అర్హత ఉన్న వారందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కళాశాల యాజమాన్యాలనూ ఇందులో భాగస్వాములను చేశారు. వారి సహాయంతో నమోదు కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఓటరు నమోదు పరిశీలన అధికారి పోలా భాస్కర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మాధవీలత బూత్ లెవెల్ అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ–2023లో భాగంగా వడపోతల అనంతరం ఓటర్లను జాబితాను గురువారం ప్రకటించారు. ఈ ప్రకారం జిల్లాలో మొత్తం 15,52,268 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,61,026 మంది. ఈసారి కూడా మహిళ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మహిళలు 7,91,128 మంది ఉన్నారు. ఇతరులు 114 మంది ఉన్నారు. గతేడాది ప్రకటించిన ఓటర్లు జాబితా ప్రకారం 15,21,332 మంది ఓటర్లు ఉండగా వారిలో 7,56,380 పురుషులు, 7,84,833 మంది స్త్రీలు, ఇతరులు 119 మంది ఉన్నారు. ఈ ఏడాది 10,936 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో పురుషులు 4,646 కాగా, స్త్రీలు 6,295 మంది ఉన్నారు. ఇతరులు మాత్రం అయిదుగురు తగ్గారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారు. పథకాల ఫలాలు వారికే అందేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో వారిలో ఓటు నమోదు పట్ల అవగాహన ఏర్పడింది. అందుకే ఓటర్ల సంఖ్య పెరిగిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

నమోదు శాతం పెరిగింది



ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాం. దీనితో ఓటు నమోదు చేయించుకోవడానికి ఆసక్తి కనబరిచారు. ఈ ఏడాది ఎక్కువ మంది మహిళా ఓటర్లు నమోదు చేసుకోవడం విశేషం. ఎక్కువగా కాలేజీ అమ్మాయిలు ముందుకు రావడం వల్ల నమోదు శాతం పెరిగింది. **- డాక్టర్ కె. మాధవీలత, కలెక్టర్**

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజక వర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
అనపర్తి	228	1,06,168	1,09,558	0	2,15,726
రాజానగరం	216	1,02,239	1,04,187	9	2,05,435
రాజమహేంద్రవరం సిటీ	225	1,23,533	1,31,716	62	2,55,311
రాజమహేంద్రవరం రూరల్	263	1,25,942	1,31,469	16	2,57,427
కొవ్వూరు	174	86,463	90,855	9	1,77,327
నిడదవోలు	205	1,01,213	1,04,964	8	2,06,185
గోపాలపురం	248	1,15,468	1,18,379	10	2,33,857
మొత్తం	1,559	7,61,026	7,91,128	114	15,52,268

రథోత్సవానికి సన్నాహాలు



షెడ్డు నుంచి వెలుపలికి తెచ్చిన రథం

సఖినేటిపల్లి: అంతర్వేది రథాన్ని గురువారం ఆలయ ప్రాంగణంలోని రథం షెడ్డు నుంచి వెలుపలికి తీసుకువచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సారథ్యంలో పల్లిపాలెం అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు, స్థానిక భక్తులు రథాన్ని ప్రాంగణంలోకి తెచ్చారు. రానున్న ఉత్సవాలకు రథాన్ని సిద్ధం చేసేందుకు వెలుపలికి తెచ్చినట్టు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

8న బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారి కల్యాణ మంటపంలో జరుగుతుంది. ఈ సంఘ అర్చక పురోహిత విభాగ ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి అయ్యప్ప గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు, దేవాదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, సంఘ ప్రధాన కార్యదర్శి యనమండ్ర సాయి సురేష్ హాజరవుతారన్నారు.

క్లుప్తంగా

క్వారీల్లో కొనసాగిన తనిఖీలు

రౌతులపూడి: కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులు నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గత రెండురోజులుగా ఎస్.పైడిపాల, ఉప్పంపాలెం, తిరుపతమ్మపేట, ములగపూడిలోని నల్లరాయి క్వారీలో చేపట్టిన తనిఖీలు గురువారం కొనసాగాయి. మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారుల సంయుక్త బృందం ఈ తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కాకినాడ మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పలు క్వారీలను గుర్తించామన్నారు. వీటిపై సమగ్ర పరిశీలన జరిపి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. తుని రూరల్ సీఐ సన్యాసిరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విష్ణువర్ధనరావు, ఏజీ శ్రీనివాసరావు, వీఆర్‌ఓ షేక్ బాబ్జి, సర్వేయర్ గోవింద్, కోటనందూరు పోలీసులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

మామిడికుదురు: కొమరాడకు చెందిన శృంగవరపు విజయదుర్గను అదనపు కట్నం కోసం వేధిస్తున్న నేరంపై అతని భర్త శ్రీనివాస్‌తో పాటు అత్త సారాదేవిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా గురువారం తెలిపారు. రాజోలు ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు నమోదు చేశామన్నారు. కొమరాడకు చెందిన విజయదుర్గకు సఖినేటిపల్లి మండలం రామేశ్వరానికి చెందిన శ్రీనివాస్‌తో 2011 నవంబర్ 19వ తేదీన వివాహం జరిగిందన్నారు. అప్పట్లో కట్నం రూపేణా రూ.నాలుగు లక్షలు నగదు, అయిదు కాసులు బంగారం ఇచ్చారని చెప్పారు. విజయదుర్గ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారని చెప్పారు. 2021వ సంవత్సరం జనవరిలో సంక్రాంతి పండగకు విజయదుర్గను భర్త శ్రీనివాస్ కొమరాడలో పుట్టింటి వద్ద దించేసి గల్ఫ్ వెళ్లిపోయాడన్నారు. అప్పటి నుంచి తనను అత్తింటికి రాకుండా భర్త, అత్త అడ్డుకుంటున్నారని, అత్తింటికి వెళ్లగా తనపై దాడి చేశారని, రూ.రెండు లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని తనను వేధించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై జానీబాషా తెలిపారు.

సేవకు చిరునామా స్వర్ణాంధ్ర

- మానవత్వం చాటుతూ ప్రయాణం
- నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులకు సేవలు అందించడంలో స్వర్ణాంధ్ర సేవాసంస్థ ముందంజలో ఉంది. సేవామార్గంలో చిన్నగా ప్రారంభించిన ప్రయాణం నేడు బహుముఖ సేవలు అందించే స్థాయికి చేరుకుంది. పేదలకు పలు సేవా కార్యక్రమాలు అందిస్తూ రాజమహేంద్రవరంలో శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుకలకు సిద్ధమైంది. 1998లో మొదలైన ఈ సేవా ప్రయాణం శుక్రవారం నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

ప్రజల సేవలో..

సామాజిక సేవలతో అడుగులు మొదలు పెట్టిన స్వర్ణాంధ్ర సంస్థ.. కాలక్రమేణా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇచ్చింది. మహిళలు, బాలలు, యువత, వృద్ధుల భవిత కోసం వృద్ధాశ్రమం, కుట్టు శిక్షణ కేంద్రం, పేద పిల్లలకు ట్యూషన్ సెంటర్, ఉచిత కంప్యూటర్ సెంటర్, కెరీర్ గైడెన్స్, వలంటీర్ ఇంటర్న్‌షిప్, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు, చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ, నిరుపేదలకు దుస్తుల పంపిణీ తదితర వాటిని నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది. కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు వలస కూలీలు తమ స్వగ్రామాలకు కాలినడకన ప్రయాణం చేస్తున్న సమయంలో జాతీయ రహదారిలో నిత్యం వందల మందికి భోజన సదుపాయం కల్పించింది. వారికి పాదరక్షలు అందించి మానవత్వాన్ని చాటుకుంది.


కరోనా వేళ వలస కూలీలకు భోజనం అందిస్తూ...


వృద్ధాశ్రమంలో సేవలు

1998లో ప్రారంభం

1998లో స్వర్ణాంధ్ర కల్చరల్ అసోసియేషన్ పేరుతో ఏర్పడినప్పటికీ కార్యక్రమాలు పెరగడంతో పాటు సమాజానికి మరింత సేవ చేయాలనే నిర్వాహకులు తలంపుతో స్వర్ణాంధ్ర సేవా సంస్థగా మారింది. అనేక సేవ, సంక్షేమ కార్యక్రమాలను అందించసాగింది. లాలాచెరువు ఏరియాలో ప్రధానంగా మూడంతస్తుల సొంత భవనం ఏర్పాటు చేసుకోగలిగింది. నిత్యం వందమంది వృద్ధులతో సంరక్షణ కేంద్రం కొనసాగుతోంది. ప్రతిరోజూ దాతల సాయంతో సుమారు 650 మందికి స్వర్ణాంధ్ర సేవాసంస్థ అన్నదానం చేస్తోంది.

ఉపాధి కల్పనా కేంద్రం

స్వర్ణాంధ్ర సంస్థ ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, వేలమందికి జీవనోపాధికి బాటలు వేశారు. ఈ సేవలకు గుర్తింపుగా హీరో మోటార్స్ సంస్థ నుంచి డాక్టర్ గుబ్బల రాంబాబు నయా ఇండియా కా కోజ్ అవార్డు అందుకున్నారు. విద్యార్థులతో పాటు మహిళలు, పురుషులకు ఉపయోగపడేలా కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. పేద పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నారు.


అవార్డు అందుకుంటున్న సంస్థ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ గుబ్బల రాంబాబు

అన్న సమారాధన

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫీడ్ ద హంగర్ నినాదాన్ని ఆచరణలో చూపేందుకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిరోజు 400 మందికి అన్నదానం చేస్తున్నారు. గత 452 రోజులుగా నిర్విరామంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

అందరి సహకారంతోనే..

నా ఆలోచనలకు, ఆశయాలకు సహకరించే స్నేహితులు, నగరంలోని సేవా మూర్తులు, దాతల సాయంతోనే స్వర్ణాంధ్ర సంస్థ ద్వారా నిరంతరం సేవలు అందించగలుగుతున్నాం. 25 ఏళ్ల సేవలు అందించిన సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకను శుక్రవారం ప్రముఖుల సమక్షంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం.

– లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకులు

కిలేడీపై కేసు నమోదు

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు రూ.లక్షల్లో టోకరా

పిఠాపురం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పిఠాపురానికి చెందిన ఒక మహిళ పలువురు నిరుద్యోగులను దోచుకున్న సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై జగన్మోహన్ కథనం ప్రకారం పిఠాపురం వైఎస్సార్ గార్డెన్స్‌లో నివాసముంటున్న కట్టు శిరీషకుమారి తనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రముఖులు పరిచయస్తులని, అన్ని ప్రభుత్వ శాఖలలోను ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించింది. తాను ప్రముఖులతో తీయించుకున్న ఫొటోలను చూపించడంతో నమ్మిన నిరుద్యోగులు ఒక్కొక్కరు రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆమెకు ఇచ్చారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు, శ్రీకాకుళం విజయనగరం, ఇతర రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగులు ఈమెకు ఉద్యోగాల కోసం భారీగా ముట్టజెప్పారు. నెలలు గడుస్తున్నా ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో డబ్బులు ఇచ్చిన నిరుద్యోగులు ఇటీవల ఆమెను గట్టిగా నిలదీయగా నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు చూపించి త్వరలోనే మీకు వస్తాయంటూ నమ్మబలికింది. కాని ఎంతకూ ఉద్యోగాలు రాకపోవడంతో గురువారం పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేయడంతో ఆమెపై, ఆమెకు సహకరించిన పిఠాపురానికి చెందిన శ్రీను అనే కానిస్టేబుల్ (ప్రస్తుతం సామర్లకోట పోలీసు స్టేషన్లో పని చేస్తున్నాడు)పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్వారపూడిలోని పరిశ్రమలో అగ్ని ప్రమాదం

రూ.40 లక్షల ఆస్తినష్టం

మండపేట: మండలంలోని ద్వారపూడిలో గల వెట్ గ్రైండర్స్ పరిశ్రమలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు రూ.40 లక్షలు ఆస్తినష్టం సంభవించినట్టు అంచనా. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. కెనాల్ రోడ్డులో గల గోడౌన్‌లో పుష్పలక్ష్మి ఇండస్ట్రీస్, కోవై లక్ష్మీ ఇండస్ట్రీస్‌లో పరిశ్రమను నిర్వహిస్తున్నారు. వెట్ గ్రైండర్లు, విడి భాగాలను తయారు చేస్తుంటారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. ఈ ఘటనలో యంత్ర సామగ్రి, ముడిసరకు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం తెలుసుకున్న అనపర్తి ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సంఘటన సమయానికి ఫ్యాక్టరీలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఏమీ కాలేదు. రోజుమాదిరి బుధవారం రాత్రి ఫ్యాక్టరీ మూసివేసి వెళ్లిపోయామని, తెల్లవారేసరికి ఈ ప్రమాదం చోటుచేసుకుందని యజమానులు బీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, దుర్గాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో రూ. 40 లక్షల నష్టం సంభవించిందని అనపర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

మోటారు సైకిళ్లు ఢీకొని ఒకరి మృతి


సూర్యమోహన్

అల్లవరం: అల్లవరం మండలం బెండమూర్లంక సెంటర్లో బుధవారం అర్ధరాత్రి ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఓడలరేవు గ్రామానికి చెందిన పెమ్మాని సూర్యమోహన్ (51) మృతిచెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అల్లవరం ఎస్సై శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్.యానం ఓఎన్‌జీసీలో డ్రిప్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పెమ్మాని సూర్యమోహన్ విధులు ముగించుకుని మోటారు సైకిల్‌పై కొమరగిరిపట్నం మీదుగా ఓడలరేవు వెళ్తుండగా, బెండమూర్లంక నుంచి కొమరగిరిపట్నం మోటారు సైకిల్‌పై వస్తున్న యేడిద సతీష్ (20) ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరారు. స్థానికులు 108లో అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సూర్యమోహన్ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సతీష్‌కు తలకు బలమైన గాయం కావడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం సతీష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఎస్సై తెలిపారు. మృతుడు సోదరుడు పెమ్మాని వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, అమ్మాయి, అబ్బాయి ఉన్నారని తెలిపారు.

అనుమానా స్పద స్థితిలో పారిశుధ్య కార్మికురాలి మృతి

- ఇంట్లో మంచంపై గాయాలతో మృతదేహం
- హత్యగా అనుమానాలు


వెంకటలక్ష్మి మృతదేహం

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు వేగి వెంకటలక్ష్మి(45) ఇంట్లో అనుమానస్పద స్థితి మృతి చెందడంతో ఇంద్రపాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం వెంకటలక్ష్మి గ్రామంలోని తూరంగేశ్వర స్వామి ఆలయంలో పారిశుధ్య కార్మికురాలిగా 15 ఏళ్లుగా పనిచేస్తోంది. తల్లిదండ్రులు చనిపోయారు. సుమారు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగినప్పటికీ ఒంటరిగానే తనకు ఉన్న చిన్న డాబాలో నివాసం ఉంటోంది.

ఇంట్లో నుంచి బుధవారం బయటకు రాకపోవడంతో పక్కింటి వారు అనుమానంతో పోలీసులకు తెలియజేశారు. బుధవారం రాత్రి 11గంటల సమయంలో పోలీసులు వెంకటలక్ష్మి ఇంటికి చేరుకుని చూడగా మృతి చెంది ఉంది. తలపై బలమైన గాయం ఉన్నట్టు గుర్తించారు. దీంతో హత్యకు గురైనట్టు భావిస్తున్నారు. మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. మృతురాలికి వరుసకు సోదరుడయ్యే ఇంద్రపాలెం గ్రామానికి చెందిన వేగి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు అనుమానా స్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు. చోరీ కోసం వచ్చి ఎవరైనా దాడికి పాల్పడ్డారా లేక ఇతర కారణాలు ఉన్నాయా అనేది దర్యాప్తులో తేలుతుందన్నారు.

సంస్కృత పండితుడు మల్లంపల్లి కన్నుమూత

కాకినాడ కల్చరల్/నల్లజర్ల: ప్రవచన కర్త, సంస్కృత పండితుడు మల్లంపల్లి అమరేశ్వరప్రసాద్ (80) హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొన్నేళ్లుగా సామర్లకోట మండలం అచ్చంపేటలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈయన స్వస్థలం ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల. ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఈయన శిష్యుడు. మల్లంపల్లి ఉద్యోగ రీత్యా కాకినాడలో స్థిర పడ్డారు. స్థానిక శ్రీనగర్‌లోని నవభారత్ ఎయిడెడ్ పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈయన శ్రీనాథుని కాశీఖండంను తెలుగులో అనువదించారు. అపర్ణాదేవి వ్రత మహిమ పుస్తకాన్ని రచించారు. శ్రీమద్ ఆంధ్ర మహా భాగవతాన్ని తెలుగులోకి అనువదించారు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంపై మంచి పట్టు సాధించారు. స్థానిక వెంకట్‌నగర్‌లో మృణాళిని విద్యాలయాన్ని స్థాపించి ఉచితంగా సంస్కృతం భాష నేర్పించేవారు. ఉపాధ్యాయ పరీక్షలకు శిక్షణ ఇచ్చేవారు. నమశ్శివాయ పంచాక్షరి కోటిసార్లు పఠించి మఠాధిపతుల నుంచి పురస్కారాలు పొందారు. సినీ దర్శకులు కె.విశ్వనాథ్‌కు ఆత్మీయుడు. సూర్యకళామందిర్‌లో 2014లో కె.విశ్వనాథ్ చేతుల మీదుగా సన్మానం పొందారు. ఈయన శివభక్తుడు, శివుని ఆరాధన లేకుండా పచ్చి మంచినీళ్లు కూడా తాగేవారు కాదని ఆయన సన్నిహితులు తెలిపారు. సుబ్రహ్మణ్య కల్యాణం, అన్నపూర్ణా కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించేవారు. ఈయన మంచి ప్రవచన కర్త అని స్థానిక సాహితీవేత్తలు కారుప్రోలు గౌరినాయుడు, జానకీరామ్‌చౌదరి, పోచినపెద్ది సుబ్రహ్మణ్యం తదితరులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. ఈయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.


మల్లంపల్లి అమరేశ్వరప్రసాద్ (ఫైల్ ఫొటో)

గుర్తుచేసుకుంటున్న నల్లజర్ల గ్రామస్తులు

అమరేశ్వర ప్రసాద్ బాల్యం నల్లజర్ల శ్రీరామకృష్ణమఠంలోనే గడిచిందని గ్రామస్తులు అప్పటి రోజులను గుర్తుచేసుకుంటున్నారు. తండ్రి నాగభూషణశర్మతో కలసి ఇక్కడ ఉండేవారని ఆయన విద్యాభ్యాసం కూడా ఇక్కడే జరిగిందని చెబుతున్నారు. ఒక తరం మొత్తానికి నాగభూషణశర్మ ఆధ్యాత్మికత, నైతికత, సాంఘిక బోధనలు నేర్పించి గ్రామస్తులందరినీ ఆధ్యాత్మికత వైపు నడిపించారని నేటికీ అదే తీరులో గ్రామస్తులు భక్తి భావంతో నడుస్తున్నారని చెబుతున్నారు. చాగంటి వారికి ఉపదేశానుగ్రహం మల్లంపల్లి వారే చేశారని, వారి మృతి మనందరికి తీరని లోటని గ్రామపెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువు అమరేశ్వరప్రసాద్ మృతికి చాగంటి కోటేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

సర్పవరంలో కోడి కత్తులు స్వాధీనం


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్

కాకినాడ రూరల్: ముందస్తు సమాచారం మేరకు సర్పవరం పరిధి భావనారాయణపురంలో కోడి కత్తుల తయారీ ప్రాంతంలో గురువారం పోలీసులు దాడి చేసి భారీగా కత్తులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ, సిబ్బంది జన చైతన్య లేఅవుట్, భావన్నారాయణపురం కాలువ గట్టు దగ్గర ఉన్న ఇంటి వద్ద కోడి కత్తులు తయారు చేస్తున్న శ్రీరంగం మాణిక్యంను అరెస్టు చేశారు. అతని నుంచి 506 కోడి కత్తులు, తయారీ పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయంత్రం పోలీసు స్టేషన్‌లో మీడియాతో అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడారు. స్వాధీనం చేసుకున్న కోడికత్తులను ప్రదర్శించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో కోడి పందేలు, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

దారుణ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

అనపర్తి: ఇచ్చిన అప్పును వసూలు చేసే విషయంలో బాధితుడిని వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుతుకులూరుకు చెందిన తమలంపూడి వీరవెంకట సత్యనారాయణరెడ్డి(34) ఆరు నెలలుగా అనపర్తి పాతవూరు రామాలయం సమీపంలో నివాసముంటున్నాడు. సత్యనారాయణరెడ్డి వ్యాపారం నిమిత్తం 6 సంవత్సరాల క్రితం మండలంలోని రామవరం గ్రామానికి చెందిన మల్లిడి వెంకటరెడ్డి వద్ద రూ.4 లక్షలు అప్పుగా తీసుకుని దఫదఫాలుగా రూ. 3.50 లక్షలు తిరిగి చెల్లించాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో మిగిలిన అప్పును చెల్లించడంలో జాప్యం జరిగింది. ఈ క్రమంలో గత మూడు నెలలుగా వెంకటరెడ్డి తాను ఇచ్చిన అప్పు వడ్డీతో రూ.8 లక్షలు అయ్యిందని, మిగిలిన మొత్తం చెల్లించాలంటూ సత్యనారాయణరెడ్డిని ఒత్తిడి చేయడంతోపాటు గత మూడు నెలలుగా వేధింపులకు గురిచేస్తూ అవమానకరంగా మాట్లాడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన సత్యనారాయణరెడ్డి ఈ నెల 4న సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సత్యనారాయణరెడ్డి భార్య లక్ష్మీప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోటరీ సెంట్రల్ క్లబ్‌కు రూ. 25 లక్షల విరాళం


రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యులకు విరాళం అందిస్తున్న శివరావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చేపట్టే శాశ్వత ప్రాజెక్టుల కోసం నగరానికి చెందిన గాది శివరావు ఆయన భార్య సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం రూ. 25 లక్షల చెక్కును గురువారం క్లబ్ సభ్యులకు అందించారు. క్లబ్ శాశ్వత ప్రాజెక్టులైన బ్లడ్ బ్యాంకు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఫిజియోథెరపీ సెంటర్ల నిర్మాణం కోసం ఈ విరాళం అందించారు. శివరావును క్లబ్ అధ్యక్షుడు సామా భాస్కర్, ప్రాజెక్టు చైర్మన్ బోడా ఆనంద్‌కుమార్, క్లబ్ ఫౌండర్ మెంబర్ వాకచర్ల సూర్యం ఆధ్వర్యంలో సత్కరించారు.

ఆస్తి వివాదంలో భార్యభర్తలపై కొడవళ్లతో దాడి

ఉప్పలగుప్తం: అన్న కుమారులు తనపైన, తన భార్యపైన కొడవళ్లతో దాడి చేశారని ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలోని ఆదిలక్ష్మీపురానికి చెందిన నాగేంద్రప్రసాద్ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఆదిలక్ష్మీపురంలో ఉమ్మడి ఆస్తి 10 ఎకరాలు చేపల చెరువుని గారపాటి రాజారావు 12 ఏళ్లుగా సాగు చేస్తూ అనుభవిస్తున్నారు. చేపల చెరువులకు రాజారావు కుమారులు గట్లు వేస్తున్న సమయంలో ఉమ్మడి ఆస్తిలో తనకి రావాల్సిన వాటాను పంచి ఇవ్వాలని తన అన్న రాజారావుని నాగేంద్రప్రసాద్ అడిగారు. అయితే రాజారావు కుమారులు ఒప్పుకోకపోవడంతో గారపాటి నాగేంద్రప్రసాద్ తనకు వచ్చే మూడు ఎకరాల భూమిలో మంగళవారం జేసీబీ సాయంతో గట్లు వేసే ప్రయత్నం చేశారు.

దీంతో రాజారావు కుమారులు గారపాటి సుబ్బారావు, వీర వెంకట సత్యనారాయణమూర్తి వారితో ఘర్షణకు దిగారు. ఘర్షణ తీవ్ర రూపం దాల్చడంతో సుబ్బారావు, వీర వెంకట సత్యనారాయణ నాగేంద్రప్రసాదు, అతని భార్య అనంతలక్ష్మిపై కొడవళ్లతో దాడి చేశారు. నాగేంద్రప్రసాదుకి నుదుటిపై గాయం కాగా, భార్య అనంతలక్ష్మి పొట్ట, ఎడమ చేయి భాగాల్లో తీవ్ర గాయాలు అయ్యాయి. భార్యాభర్తలు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జి.వెంకటేశ్వరరావుతెలిపారు.